మాట్లాడుతున్న కౌశిక హరి

బూడిద లోడింగ్‌లో దళారులను నిర్మూలించాలి

ఉచితంగా ఎన్టీపీసీ లోడింగ్ చేపట్టాలి : బీఆర్ఎస్ నేత కౌశికహరి

జ్యోతినగర్, మార్చి 4: ఎన్టీపీసీ బూడిద లోడింగ్‌లో జరుగుతున్న దళారుల వసూళ్లను నిర్మూలించి, ఎన్టీపీసీ ఉచితంగా బూడిద లోడింగ్ చేపట్టాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిహరి డిమాండ్ చేశారు. మంగళవారం ఎన్టీపీసీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లారీలపై జీవనోపాధి పొందుతున్న యాజమానులను కాదని ఎన్టీపీసీ టెండర్ ప్రక్రియతో దళారులను తయారు చేశారని ఆరోపించారు. నేషనల్ హైవేల నిర్మాణానికి తరలిస్తున్న లారీలకు ఎన్టీపీసీ టన్నుకు రూ. 1,260 చెల్లిస్తున్నదని, స్థానికంగా ఇటుక బట్టీలకు రవాణా చేసుకునే ఇక్కడి లారీ యాజమానులకు ఎలాంటి చెల్లింపులు లేవన్నారు. పైగా లోడింగ్‌కు రూ. 4,600 వసూలు చేయడంతో ట్రిప్పులు లేక లారీ యాజమానుల కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ లారీ యాజమానులు, కాంట్రాక్టర్లు, మట్టి అమ్మకపుదారుల పొట్టలు కొడుతూ, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి కూడా గండికొడుతూ రోజుకు రూ. 30లక్షల వరకు అక్రమంగా దండుకుంటున్నారని ఆరోపించారు. ఈ దళారుల వసూళ్లను నిలిపివేయాలన్నారు. ఉచితంగా బూడిద లోడింగ్, బూడిద ట్రాన్స్‌పోర్టును స్థానిక లారీ యాజమానులకు ఇవ్వాలని ఎన్టీపీసీ సీజీఎంకు విన్నవించినట్లు తెలిపారు. ఇక్కడ బీఆర్ఎస్, లారీ అసోసియేషన్, ఇతర కార్మిక సంఘాల నాయకులు శంకర్‌గౌడ్, రాంబాబు, విజయ్, సతీశ్‌గౌడ్, శ్రీనివాస్, రాములు, కోదాటి ప్రవీణ్, రాజమల్లయ్య ఉన్నారు.

ఇసుక లారీలతో లేస్తున్న దుమ్ము

లారీ వెళ్తుండగా లేస్తున్న దుమ్ము

ముత్తారం, మార్చి 4: మండలంలోని ఖమ్మంపల్లి, జిల్లాలపల్లిలో తాడిచర్ల బ్లాక్ 1, 2 నుంచి ఇసుక క్వారీల నుంచి నిత్యం వందలాది లారీలు ఇసుక తరలిస్తుండడంతో రోడ్డుపై దుమ్ము లేస్తున్నది. దీంతో గ్రామప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇసుక క్వారీల నుంచి జిల్లాలపల్లి, ఖమ్మంపల్లి, రంగయ్యపల్లి గ్రామాల నుండి నిత్యం వందల లారీలు వెళ్తుండడంతో ఇంట్లోని మంచినీటిలో, తినే ఆహారంలో సైతం దుమ్ము పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా శ్వాసకోశ ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. వందలాది లారీలు పోవడంతో రోడ్లు గుంతలమయం అయ్యాయని, ముందు లారీలు వెళ్తున్నప్పుడు లేచిన దుమ్ముకు గుంతలు పడిన రోడ్డు కనపడక వాహనాదారులకు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇంత ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల రంగయ్యపల్లి గ్రామానికి చెందిన కర్రె రాంచంద్రం దుమ్ముతో ఇబ్బందులు పడున్నామని రోడ్‌పై మంచం వేసి పడుకొని నిరసన తెలిపిన కూడా అధికారుల్లో స్పందన కరువైంది. తమ ఖజాన కొల్లగొడుతూ మా కళ్లలో దుమ్ము కొట్టడం పద్ధతి కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. కలెక్టర్, టీఎస్ఎండీసీ అధికారులు స్పందించి దుమ్ము లేవకుండా నీళ్లు చల్లించాలని, ఈ ప్రాంతం నుంచి ఇసుక క్వారీలను నిలిపివేయాలని కోరుకుంటున్నారు.

మండువేసవిలో జల సముద్రం

- కేసీఆర్ ముందు చూపునకు నిదర్శనం చెక్‌డ్యాం నిర్మాణాలు
- మానేరులో మత్స్య సంపద.. చేపల వేటలో మత్స్యకారులు..
- మత్స్యకారులకు జీవనోపాధి కల్పిస్తున్న చెక్‌డ్యాం..

మంథని రూరల్, మార్చి 4 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తన ముందు చూపుతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించారు. ఇందుకు నిదర్శనం మంథని మండలం అడవిసోమన్‌పల్లిలోని చెక్‌డ్యాం. మండు వేసవిలో జలసముద్రాన్ని తలపిస్తున్నది. కేసీఆర్ చేపట్టిన ప్రతి పథకం వెనుక ప్రజలు ఆర్థికంగా ఎదిగేందుకు గ్రామాల్లో ఉన్న వనరులను ఒడిసిపట్టేలా పటిష్టమైన ప్రణాళికలు రూపొందించారు. మంథని మండలం అడవిసోమన్‌పల్లి సమీపంలోని మానేరు నదిపై నిర్మించిన చెక్ డ్యాం ద్వారా ఎంతో మందికి పలు రకాలుగా ఉపయోగపడుతున్నది. ఒక పక్క గోదావరి, దానిలో కలిసే మానేరు నీటిని వృథాగా పోకుండా ఉండేందుకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ నేతృత్వంలో చెక్ డ్యాం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చెక్‌డ్యాం నిర్మాణం పూర్తయిన తరువాత వాటి ఫలాలు ప్రజల కండ్ల ముందు కనిపిస్తున్నాయి. చెక్‌డ్యాం ద్వారా మానేరులో మత్స్య సంపద పెరగడంతో మత్స్యకారులు చేపల వేటను కొనసాగిస్తు జీవనోపాధిని పొందుతున్నారు. దాదాపుగా కిలోమీటరు మేర నీరు నిల్వ ఉండడంతో పెద్ద ఎత్తున చేపల వేట కొనసాగుతున్నది. ఇదే కాకుండా పక్కన ఉన్న గోదావరి వట్టిపోవడంతో మానేరుపై నిర్మించిన చెక్‌డ్యాంతో బ్యాక్ వాటర్ నిలిచి చుట్టు పక్కన ఉన్న గ్రామాల్లో భూగర్భ నీటి మట్టాన్ని కాపాడుతున్నది.

మానేరులో నిలిచిన నీరు

మత్స్యకారులకు జీవనోపాధి.. రైతులకు సాగు నీరు

చెక్‌డ్యాం నిర్మాణంతో మత్స్యకారులకు రోజు సుమారుగా రూ. 500 నుంచి రూ. వెయ్యి వరకు జీవనోపాధి లభిస్తుంది. దీనితో పాటుగా రైతులకు సైతం సాగు, తాగు నీటికి కొదవలేదు. సమీప గ్రామాలైన నాగెపల్లి, వెంకటాపూర్, పీవీనగర్, దామరకుంట తదితర గ్రామాల్లో బావులు, బోర్లల్లో పుష్కలంగా నీరు లభిస్తుంది. గోదావరి పూర్తిగాఎండి పోవడంతో భూగర్భ జలాలు అడుగంటి ఇటు రైతులకు, అటు నీరు లేక మత్స్యకారులకు జీవనోపాధి లేకుండా పోయింది. అడవిసోమన్‌పల్లి గ్రామంలో గల దాదాపు 30 కుటుంబాలు చేపల వేట కొనసాగిస్తు తమ కుటుంబాలను పోషించుకుంటున్నాయి. రోజు ఉదయం 5 గంటల వరకు చేపల వేట మొదలు పెట్టగానే చుట్టు పక్కన ఉన్న ప్రజలు స్వచ్ఛమైన చేపల కోసం ఇక్కడికి వస్తున్నారు.

చేపల వేటతో జీవనం సాగిస్తున్న

చెక్‌డ్యాంలో ఉన్న చేపలు పట్టుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్న. రోజు పొద్దున 5గంటలకు వచ్చి చేపలు పట్టి వాటిని అమ్ముతుంటా. చెక్‌డ్యాంతో మాకైతే మేలు అయితాంది. నీళ్లు పుష్కలంగా ఉండడంతో చేపలు పట్టి ఇక్కడే అమ్ముతున్న. ప్రజలు సైతం ఇక్కడికే వచ్చి చేపలను కొనుకుంటుండ్లు. కిలోకు రూ. 150 చొప్పున అమ్ముతున్నం. ఎంతలేదన్నన రోజుకి రూ. 500 నుంచి రూ. వెయ్యి వరకు గిట్టుబాటు అయితంది.

- నానుబోతుల కిష్టయ్య, మత్స్యకారుడు, అడవిసోమన్‌పల్లి

నీళ్లు నిలుత్తయని అనుకోలే..

ఇక్కడ కట్టిన చెక్‌డ్యాంలో ఇన్ని నీళ్ళు నిలుస్తయని అనుకోలేదు. ఒకప్పుడు నీళ్లని గోదావరిలో కలసి అట్టిగా పోయేది. ఇప్పుడు నీళ్లు నీలువడంతో పాటుగా మస్తు చేపలు ఉన్నయ్. ఈ చేపలు పట్టి ఇక్కడే అమ్మి సంతోషంగా ఇంటికి పోతున్న. గోదావరి ఎండిపోవడంతో అక్కడ ఉన్న మత్స్యకారులు సైతం ఇక్కడికి వచ్చి చేపలు పట్టెటోళ్లు.ఎంతో మందికి చెక్‌డ్యాం మేలు చేస్తుంది.

జాగి శంకర్, మత్స్యకారుడు, అడవిసోన్‌పల్లి

రైతులకు ఎంతో మేలు..

చెక్‌డ్యాం నిర్మాణంతో రైతులకు మంచి మేలు జరిగింది. ఎప్పుడు నీరు వట్టిగనే గోదారిలో కలిసేది. కానీ ఇప్పుడు నీరు నిలువ ఉండటంతో రైతులకు పంట పొలాలు పచ్చగా ఉన్నయ్. గ్రౌండ్ వాటర్ సైతం పెరగడంతో బోర్లు, బావుల్లో పుష్కలంగా నీళ్లు ఉన్నయ్. కేసీఆర్ చెక్‌డ్యాంలతో రైతులకు మస్తు లాభం అయితంది. గోదారి మాత్రం వట్టిపోవడంతో చుట్టుపక్కన ఉన్న గ్రామాల ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోతున్నరు.

కుంట్ల రాజగౌడ్, నాగేపల్లి, రైతు

మారుపేర్ల సమస్య పరిష్కారానికి హామీ

గోదావరిఖని, మార్చి 4: సింగరేణిలో మారుపేర్ల సమస్య పరిష్కారానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం క్యాంపు కార్యాలయంలో మారుపేర్ల బాధితులు ఎమ్మెల్యేను కలిసి వారి సమస్యను వివరించారు. ఎన్నో సంవత్సరాలుగా సింగరేణిలో మారుపేర్ల సమస్యతో కారణ్య నియమకం కింద రావాల్సిన ఉద్యోగాలను యాజమాన్యం ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెట్టిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. జరుగుతుందని భరోసా కల్పించారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

కోల్‌సిటీ, మార్చి 4: రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గోదావరిఖని లక్ష్మీనగర్, కల్యాణ్‌నగర్‌లో జరుగుతున్న రోడ్ల అభివృద్ధి పనులను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ కార్పొరేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. లక్ష్మీనగర్‌లో 40 ఫీట్లతో రోడ్డు వెడల్పు పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు, వ్యాపారులకు వినియోగంలోకి తీసుకురావాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. అనంతరం 25వ డివిజన్ పరిధిలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పిల్లలతో కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డివిజన్ ప్రజలు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మందుబాబులకు సామాజిక శిక్ష

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 4: డ్రంక్‌అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 15మంది మందుబాబులకు గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నల్లాల వెంకట సచిన్‌రెడ్డి సామాజిక సేవ శిక్షణను విధించారు. ఇటీవల ఎన్టీపీసీ, గోదావరిఖని టూటౌన్ పోలీస్టేషన్ల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టబడగా, పోలీసులు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి వారికి అడ్డగుంటపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేయాలని శిక్ష విధించారు. ఈ మేరకు పోలీసులు ఈ శిక్షను అమలు చేశారు.

నేటి నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు

పెద్దపల్లి/మంథని/ఓదెల, మార్చి4: జిల్లాలో నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఈనెల 5 నుంచి 25 దాకా ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. మొదటి సంవత్సరంలో ఫస్టియర్ – 4894, సెకండియర్–5636 మంది కాగా, మొత్తం 10,530 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష ప్రతి పరీక్ష కేంద్రంలో 5 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, మాస్‌కాపీయింగ్ జరగకుండా సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో డెక్ బృందం పర్యవేక్షించనున్నట్లు డీఐఈవో దాసరి కల్పన తెలిపారు. ఈ పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతిస్తామని చెప్పారు.

మాతాశిశు కేంద్రంలో దోబీ మిషన్

పెద్దపల్లి టౌన్, మార్చి 4: కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చొరవతో జిల్లా అభివృద్ధి నిధుల నుంచి ప్రభుత్వ దవాఖానలోని మాతాశిశు సంరక్షణ కేంద్రానికి దోబీ మిషన్ మంజూరు చేయించారని, త్వరలోనే ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభిస్తారని డీసీహెచ్ఎస్ డాక్టర్ కొండ శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకురులతో మాట్లాడారు. జిల్లా అభివృద్ధి నిధుల ద్వారా మంజూరైన దోబీ (మెకనైజ్‌డ్ లాండ్రీ మిషన్)ను అమర్చినట్లు తెలిపారు. రోగుల బట్టలు పరిశుభంగా ఉండేందుకు దోబీ మిషన్ ఏంతగానో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. జిల్లా దవాఖాన కావడంతో ఎక్కువ సమయం బట్టలు ఉతకడానికి అవసరమయ్యే పనిభారం తగ్గుతుందని అందుకే దోబీ మిషన్ కొనుగోలు చేసినట్లు తెలిపారు. దవాఖానపైన ప్రత్యేక చొరవతో దోబీ మిషన్ మంజూరుకు కృషి చేసిన కలెక్టర్ కోయ శ్రీహర్షకు డాక్టర్ శ్రీధర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రూ. వెయ్యి ఇవ్వకపోవడం సిగ్గుచేటు

మంథని, మార్చి4: మున్సిపల్‌లో పని చేసే కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి జీతం రూ. వెయ్యి పెంచి తొమ్మిది నెలలుగా ఇవ్వకపోవడం సిగ్గు చేటని సీఐటీయూ నాయకులు విమర్శించారు. పెంచిన జీతం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుటు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేష్ మాట్లాడారు. జిల్లాల్లోని అన్ని మున్సిపాలిటీల్లో రూ. వెయ్యి వేతనాన్ని కార్మికులకు అందజేస్తున్నా మంథనిలో మాత్రం ఇవ్వక పోవడం సిగ్గు చేటన్నారు. ఎన్ఎంఆర్ కార్మికులను కాంట్రాక్ట్ పద్ధతిన తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బావు రవి,యూనియన్ నాయకులు చిప్పకుర్తి చందు, సింగారపు గట్టయ్య, ఎడ్లపల్లి రాజయ్య, మల్లేశ్, భాగ్య, సుక్కమ్మ పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

కోల్‌సిటీ, మార్చి 4: ఈనెల 9న హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరగనున్న 17వ అఖిల భారత పద్మశాలీ మహాసభ పోస్టర్‌ను గోదావరిఖని మార్కండేయ కాలనీలోని శివాలయంలో ఆ సంఘం ప్రతినిధులు మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండేటి రాజేష్, జిల్లా అడ్‌హక్ కమిటీ చైర్మన్ నీలయ్య, నాయకులు బూర్ల లక్ష్మీనారాయణ, చందు, పోపా అధ్యక్షులు వడ్డెపల్లి దినేశ్, ఆర్ఎస్ మూర్తి, సిరిపురం నర్సయ్య, గుండేటి శంకర్, శ్రీనివాస్, బొద్దుల వేణు, కన్నం ప్రభాకర్, దాసరి శ్రీనివాస్, బండారి స్రవంతి, తౌటం శాంతి, రాజేందర్, నాగేశ్వరరావు, బొద్దుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కమాన్ పూర్, మార్చి 4: కమాన్‌పూర్‌లో అఖిల భారత పద్మశాలీ మహాసభ పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ జిల్లా అడ్‌హక్ కమిటీ చైర్మన్ వలస నీలయ్య, నాయకులు బూర్ల లక్ష్మీనారాయణ, పెగడ చందు, కుందారపు బాపు, తాటికొండ శంకర్, ఆడెపు రమేశ్, బత్తుల సమ్మయ్య, చిటికెన రవి, బండి లక్ష్మణ్, కొండి రామ్మూర్తి, కొలిపాక వెంకన్న, సంపత్, గడ్డం శ్రీను, వాడేటి వెంకటేశ్, పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు

వీడ్కోలు కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

జూలపల్లి, మార్చి 4 : తేలుకుంటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆత్మీయం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు, జూనియర్స్ కలిసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఒకరికొకరూ ఆలింగనం చేసుకుని ప్రేమానురాగాలు పంచుకున్నారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులంతా ఆట, పాటలతో నృత్యాలు చేస్తూ హోరెత్తించారు. కార్యక్రమంలో హెచ్ఎం రవీందర్, ఉపాధ్యాయులు సంజీవరెడ్డి, మహేశ్‌కుమార్, శ్రీనివాస్, రజిత, గోపాల్, వ్యాసకృష్ణ, రమేశ్, రాజశేఖర్, సతీశ్ పాల్గొన్నారు.

పిచ్చికుక్కల స్వైర విహారం

ఓదెల, మార్చి 4: ఓదెల మండల కేంద్రంలో పిచ్చికుక్కల దాడిలో మంగళవారం 10మందికి గాయాలయ్యాయి. ఐదారు రోజులగా పిచ్చికుక్కలు గ్రామంలో విచ్చలవిడిగా తిరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. మంగళవారం వివిధ పనుల నిమిత్తం రోడ్లపై వెళ్తున్న వారిపై దాడి చేసి గాయపరిచాయి. పిచ్చికుక్కల కారణంగా గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. కుక్కల దాడిలో లక్ష్మి, అప్పని పద్మ, బుద్ది కనకమ్మ, శంకర్, లక్ష్మి, ప్రమీల, మధునమ్మ తదితరులు గాయపడ్డారు. బాధితులు స్థానిక దవాఖానకు రాగా, డాక్టర్ షహబాజ్‌ఖాన్, వైద్య సిబ్బంది పరీక్షలు చేసి చికిత్స అందించారు. పిచ్చికుక్కలను నియంత్రించాలని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి చంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. పిచ్చికుక్కల భయంతో వ్యవసాయ పనులకు, కూలీలకు వెళ్లే మహిళలు జంకుతున్నారు.

జూలపల్లిలో..

జూలపల్లి, మార్చి 4:జూలపల్లిలో మంగళవారం పిచ్చి కుక్కలు దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. రోడ్డుపై నడుకుంటూ వెళ్తున్న ముగ్గురిపై దాడి చేసి గాయపర్చినట్లు గ్రామస్తులు తెలిపారు. వైద్య చికిత్స కోసం వెంటనే పెద్దపల్లి సర్కారు దవాఖానకు తరలించారు. కుక్కలు గుంపులు గుంపులుగా ప్రధాన కూడళ్ల వద్ద తిష్ట వేసి పాదచారులు, ప్రయాణికుల వెంట పడుతున్నాయి. పంచాయతీ అధికారులు కుక్కలను తరిమి వేయడానికి చర్యలు తీసుకోవడం లేదంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

అర్ధరాత్రి చోరీ

జూలపల్లి, మార్చి 4 : జూలపల్లిలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంగళ వెంకటేశం కిరాణంతోపాటు బెల్టుషాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు సుత్తితో తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. రూ. 5 వేల నగదు, మద్యం బాటిళ్లు దొంగిలించుకుపోయారు. వెంకటేశం పోలీసులకు ఫిర్యాదు చేయగా, మంగళవారం ఘటన స్థలాన్ని పరిశీలించారు.

మహిళ లకు ఆటల పోటీలు

రామగిరి, మార్చి 4: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో లేడీస్ క్లబ్ సభ్యులకు మంగళవారం స్థానిక సీఎన్‌సీవోఏ క్లబ్‌లో ఆటల పోటీలు నిర్వహించారు. సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకర్ రావు పోటీలనుప్రారంభించారు. విజేతలకు ఈ నెల 8న జరిగే మహిళా దినోత్సవంలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్ గుర్రం శ్రీహరి, నిర్వాహకులు సుధాకర్, నాగరాజు, లేడీస్ క్లబ్ సభ్యులు హరిణి తదితరులున్నారు.

నేరుగా పథకాలు అందించాలి

జ్యోతినగర్, మార్చి 4: భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పథకాలను ప్రైవేటు ఇన్సూరెన్సు కంపెనీలకు కట్టబెట్టొద్దని ప్రభుత్వమే నేరుగా సంక్షేమ బోర్డు పథకాలను కార్మికులకు అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) జిల్లా అధ్యక్షుడె ఈ నరేశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సహాయక కార్మిక శాఖ అధికారి కార్యాలయం ఎదుట మంగళవారం భవన నిర్మాణ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకుల బీ అశోక్, ఎల్లయ్య, రాజేశం, దుర్గయ్య, మల్లేశం, రవికుమార్, కొమురయ్య, రాజనర్సు, రాజయ్య, రాజమౌళి, భూషణం, సాంబయ్య, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

పెద్దపల్లి టౌన్, మార్చి 4: జిల్లా పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని, ప్రతి నెల గ్రీన్ చాలన్ ద్వారానే వేతనాలు చెల్లించాలని కోరుతూ డీపీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేసినట్లు సీఐటీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీపెల్లి రవీందర్ తెలిపారు. మంగళవారం డీపీవో కార్యాలయంఓ వినతి పత్రం అందజేశారు.ఇక్కడ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా, నాయకులు ఇరుగురాల లచ్చయ్య, శ్రీనివాస్, రాజయ్య, లక్ష్మణ్, నరేశ్, సతీశ్ తదితరులు ఉన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలి

కోల్‌సిటీ, మార్చి 4: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) బలోపేతానికి కృషి చేస్తానని డాక్టర్ వాసంపల్లి ఆనంద్‌బాబు అన్నారు. ఈమేరకు గోదావరిఖనికి చెందిన ఆనంద్ బాబు మంగళవారం హైదరాబాద్‌లో టీఆర్ఎస్‌లో చేరారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు తోడేటి శంకర్ గౌడ్, ఈదునూరి నర్సింగ్, కనుకుంట్ల రమేశ్, మామిడిపల్లి శ్రీనివాస్, శివ, చిలుముల సంతోష్, తాటికొండ రమేశ్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి విజేతలకు అభినందన

సుల్తానాబాద్, మార్చి 4 :జాతీయస్థాయిలో విజేతలుగా నిలిచిన ఐపీఎస్ విద్యార్థులను డీఈవో మాధవి మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. హైదరాబాద్‌లోని విశ్వం ఎడ్యూ టెక్, గామా ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్, వేదిక్, గణిత, స్పెల్లింగ్ బి. జాతీయస్థాయి పోటీల్లో సుల్తానాబాద్ పట్టణంలోని ఐపిఎస్ పాఠశాల విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారనీ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

I, KANKUNTLA NARESH MALLAIAH S/o. KANKUNTLA MALLAIAH (Old Name) H.No. 2-98 Village: Vegurupalle, Mandal Manakondoor,Dist:Karimnagar Telangana. My Name Was Change to KANKUNTLA NARESH S/o. KANKUNTLA MALLAIAH (New Name)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

అద్దె భవనాలను పరిశీలించిన జడ్జిలు

ఓదెల, మార్చి 4: ఓదెల మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన కోర్టు ఏర్పాటుకు అద్దె భవనాలను జడ్జిలు మంగళవారం పరిశీలించారు. పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రావు, సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి గణేశ్‌లు ఓదెల గ్రామాన్ని సందర్శించి కోర్టుకు అనువైన పలు అద్దె భవనాలను పరిశీలించారు. ఓదెల, కాల్వశ్రీరాంపూర్ రెండు మండలాలకు గాను ఓదెలలో కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం మంజూరు ఇచ్చింది. ఇక్కడ కోర్టు ఏర్పాటు వలన కేసుల సత్వర పరిష్కారానికి వీలుంటుందని జడ్జిలు పేర్కొన్నారు. వెంట పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేశ్, కోర్టు సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

రామగిరి, మార్చి 4 : విద్యార్థులకు నాణ్యతతో కూడిన బోజనం ఇతర ఆహార పదార్థలు అందించాలని డీఈవో డి. మాధవి సూచించారు. మంగళవారం మండలంలోని పన్నూర్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. అక్కడి పదో తరగతి విద్యార్థులకు ఏలాంటి ఆహారం అందిస్తురన్న విషయంపై వంట గదులు, డైనింగ్ హాల్‌లో పాత్రలు పరిశీలించారు. విద్యార్థులకు ఏలాంటి లోటుపాట్లు రాకుండా తగిన శ్రద్ధ వహించాలని ప్రత్యేక అధికారి మంజులకు సూచించారు.

సమీక్ష సమావేశం

ఎలిగేడు, మార్చి 4 :ఎలిగేడు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు,ఈ–పంచాయతీ ఆపరేటర్లతో ఎంపీడీవో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ అరీఫ్ హుస్సేన్,ఏపీఓ సదానందం,పంచాయితీ కార్యదర్శులు– ఈ–పంచాయితీ ఆపరేటర్లు ఫాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

మంథని రూరల్, మార్చి 4: వేసవి దృష్ట్య